'ధరణి' సమస్యలు

92 శాతం పరిష్కరించాం

- ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి
- 31లోపు ఎల్ఆర్ఎస్ చెల్లిస్తే 25 శాతం మినహాయింపు
- మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

ఇంటర్వ్యూ


మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'ధరణి' దరఖాస్తులు 92 శాతం పరిష్కారం అయ్యాయని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేశ్ తెలిపారు. ఈ నెలాఖరు లోగా ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లిస్తే 25 శాతం మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంచడంతో భూమిని కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వివరించారు.

జిల్లాలో 'ధరణి' పోర్టల్‌లో తప్పులపై వచ్చిన దరఖాస్తుల పరిస్థితి ఏమిటి?

జిల్లాలో ధరణి సమస్యలపై 14 వేల దరఖాస్తులు వచ్చాయి. సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ మార్గదర్శకాల మేరకు ఇందులో 92 శాతం పరిష్కరించాం. ప్రస్తుతం 800 దరఖాస్తులు మాత్రమే సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే ధరణి స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకువచ్చే అవకాశముంది. ఇందులో మాడ్యూల్స్‌నూ తగ్గించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

గృహలక్ష్మి పథకంలో జిల్లాలో మొదటి విడత ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు?

జిల్లాలో మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 1,555 ఇళ్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం గ్రౌండింగ్ దశలో ఉన్నాయి. 130 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయి. మిగతావి దశలవారీగా నిర్మిస్తాం.

ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు పనులు ఎప్పుడు పూర్తవుతాయి?

భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు పరిహారం అందజేయడానికి ఉన్నతాధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి.

రేషన్ షాపులకు బియ్యం పంపిణీ సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు ఎందుకు వస్తున్నాయి?

రేషన్ డీలర్లకు బియ్యం సరఫరాలో లోపాలు ఏమీ లేవు. కొన్ని మండలాలలకు శనివారం బియ్యం పంపిణీ జరిగింది.

మెదక్ అదనపు కలెక్టర్‌గా రావడం ఎలా ఉంది?

ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారుల సమష్టి కృషితో అభివృద్ధి చేస్తున్నాం.

సంగారెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని నాన్సాబ్‌గడ్డలో సోమవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. రంజాన్ మాసం కావడంతో ఉపవాసం ముగియగానే ముస్లిం సోదరులకు పండ్లు తినిపించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లింలకు జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.


ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


సంగారెడ్డి పట్టణంలోని నాన్సాబ్‌గడ్డలో జరిగిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (మంగళవారం సాయంత్రం)
సహర్: 5:00 (బుధవారం ఉదయం)



అమీన్‌పూర్

- అభివృద్ధి పనులకు నిధుల గ్రహణం
- పిల్లర్ల స్థాయిలోనే కూరగాయల మార్కెట్
- కలగానే ఇండోర్ స్టేడియం
- రాక్ గార్డెన్‌కు నిధుల కొరత

7

బిలాల్‌పూర్‌లో భూకంపం పుకార్లు

ధ్రువీకరించని అధికారులు

కోహీర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్‌లో గ్రామంలో సోమవారం ఉదయం 6.45 గంటల సమయంలో మూడు సెకండ్ల పాటు భూమి కనిపించిందని పలువురు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ఉదయం పూట భారీ శబ్దంతో పాటు మూడు సెకన్ల పాటు భూమి కపించిందని పలువురు తెలిపారు. దీంతో ఇళ్లలో వస్తువులు, తలుపులు, కిటికీ రెక్కలు, ఫ్యాన్‌లు కదిలినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. అయితే, గ్రామంలో భూకంపం సంభవించినట్లు అధికార వర్గాలు ధ్రువీకరించలేదు. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ ప్రకారం సోమవారం ఉదయం రాష్ట్రంలో ఎక్కడ కూడా భూకంపం సంభవించినట్లు నమోదు కాలేదు.

గుట్టుగా ఫైనాన్స్ దందా

- జోరుగా జీరో వ్యాపారం
- నగదుకు హామీగా ఆస్తుల తాకట్టు
- గడువులోగా చెల్లించకుంటే ఆస్తులు పోయినట్టే..
- వడ్డీ వ్యాపారుల నిలువు దోపిడీ
- ఆర్థికంగా నష్టపోయి సామాన్యుల విలవిల

సంగారెడ్డికి చెందిన రాజ్‌కుమార్ ఆరు గుంటల భూమిని ప్రైవేట్ వ్యక్తి వద్ద తనఖా పెట్టి రూ.8లక్షల రుణం తీసుకున్నాడు. ఇందుకోసం ఆరు గుంటల భూమిని ఆ వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. నెలావారీ 3 శాతం వడ్డీ రూ.24వేలు, అసలు రూ.8 లక్షలు కలిపి.. రెండేళ్లకు రూ.13,76,000 సదరు వ్యక్తికి చెల్లించేందుకు ఒప్పుకున్నాడు. గడువు లోపు చెల్లించకపోతే తనఖా పెట్టిన భూమి అప్పిచ్చిన వ్యక్తి సొంతమయ్యేలా ఒప్పందంపై సంతకం చేశాడు. రాజ్‌కుమార్ సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో తనఖా పెట్టిన భూమిని అప్పిచ్చిన వ్యక్తి సొంతం చేసుకున్నాడు. ఆ భూమి విలువ మార్కెట్‌లో రూ.30లక్షలు పలకుతుంది.

పటాన్‌చెరుకు చెందిన కిషోర్ వ్యాపారం కోసం వడ్డీ వ్యాపారి వద్ద రూ.2లక్షలు.. మూడు రూపాయల వడ్డీకి తీసుకున్నాడు. అప్పిచ్చిన వ్యక్తి ప్రతి నెలా రూ.6 వేల చొప్పున.. సంవత్సరానికి అయ్యే రూ.72 వేలు వడ్డీని ముందుగానే మినహాయించుకుని రూ.1.28 లక్షలు కిషోర్‌కు ఇచ్చాడు. ఈ మొత్తం ప్రతి నెలా రూ.16,666 చొప్పున సంవత్సరం పాటు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. ఈ లెక్కన వడ్డీ వ్యాపారి రూ.1.28 లక్షలు మాత్రమే ఇచ్చి.. ఏడాదికి రూ. 2,71,992 వసూలు చేశాడు.



సంగారెడ్డి క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఫైనాన్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. సామాన్యుల అవసరాలను అవకాశంగా తీసుకొని వడ్డీ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. వీక్లీ ఫైనాన్స్, డెలీ ఫైనాన్స్, నెలావారీ ఫైనాన్స్ పేరిట నిలువు దోపిడీ చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు గానీ లేకుండా జిల్లాలో కోట్ల రూపాయల్లో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. లక్షా, రెండు లక్షల వరకు ఎలాంటి తనఖా లేకపోయినప్పటికీ రూ.5లక్షలు దాటితే భూమి, ఇళ్లు, ఆస్తులు తనఖా పెట్టాల్సిందే. గడువులోగా చెల్లించకుంటే ఆ ఆస్తులను వదులుకోవాల్సిందే. అత్యవసరం కావడంతో అడిగినంత వడ్డీ చెల్లిస్తామని ఒప్పుకొని అప్పులు చేసిన సామాన్యులు మానసికంగా, ఆర్థికంగా చితికిపోతున్నారు. ముందుగానే రాసుకున్న ఒప్పందం ప్రకారం డబ్బు గడువులోగా చెల్లించకపోవడంతో బాధితులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆస్తులను వదులుకుంటున్నారు.

అన్ని పట్టణాల్లోనూ అక్రమ వ్యాపారం

జిల్లాలోని ముఖ్య పట్టణాలైన పటాన్‌చెరు, రామచంద్రపురం, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ తదితర పట్టణాల్లో జీరో ఫైనాన్స్ వడ్డీ వ్యాపారం కొనసాగుతోంది. చిరు వ్యాపారాలు చేసుకుని జీవించే సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీ వ్యాపారులు జలగల్లాగా పట్టి పీడిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీక్లీ ఫైనాన్స్, డెలీ ఫైనాన్స్ నెలావారీ ఫైనాన్స్ పేరిట ఫైనాన్స్ ఇస్తున్నారు. సమయానికి వాయిదాలు చెల్లించకుంటే వడ్డీల మీద వడ్డీ వేసి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. భూమి, ఆస్తులను తనఖా పెట్టుకొని సకాలంలో డబ్బు తిరిగి చెల్లించకుంటే హస్తగతం చేసుకుంటున్నారు. ఇచ్చిన డబ్బుకంటే నాలుగైదు రెట్లు ఎక్కువ లెక్కలు చూపించి కోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారు.

మూడేళ్లలో జిల్లాలో నమోదైన చీటింగ్ కేసులు

సంవత్సరం	2022	2023	2024
చీటింగ్ కేసులు	200	211	179
నమ్మక ద్రోహం కేసులు	28	23	17

చితికిపోతున్న బతుకులు

అత్యవసర రుణాల కోసం కొందరు బ్యాంకులను ఆశ్రయిస్తే ప్రక్రియ నెలల తరబడి సాగుతోంది. ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఫీజులంటూ వసూలు చేస్తున్న బ్యాంకు కన్సల్టెంట్లు ఆఖరు నిమిషంలో లోన్ రెజెక్ట్ అయ్యిందంటూ చెబుతున్నారు. దీంతో సామాన్యులు ప్రైవేట్ ఫైనాన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. మూడు నుంచి నాలుగు రూపాయల వడ్డీని వసూలు చేస్తున్నా.. అవసరానికి డబ్బు చేతిలో పడుతుండటంతో వ్యాపారుల వద్దనే రుణాలు తీసుకుంటున్నారు. కానీ, అనుకున్న పనులు కాకపోవడం, వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో డబ్బులు తిరిగి చెల్లించలేకపోతున్నారు. తిరిగి చూసేసరికి నెల రావడంతో అసలు, వడ్డీలు కట్టలేక ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల చేతుల్లో పడి నలిగిపోతున్నారు. అసలు, వడ్డీలు కట్టలేక రోడ్డుపాలవుతున్నారు. తనఖా పెట్టిన విలువైన ఆస్తులను సైతం పోగొట్టుకుంటున్నారు. వడ్డీకి డబ్బులు ఇచ్చే ముందే వ్యాపారులు అగ్రిమెంట్లు రాసుకోవడం, ఆస్తులను తమ పేరిట మార్టిగేజ్ చేసుకోవడంతో బాధితులు ఎవరికీ చెప్పలేకపోతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయలేక నలిగిపోతున్నారు.

పీఎంశ్రీకి 31 పాఠశాలలు

ఒక్కో స్కూల్‌కు 25 ట్యాబ్‌లు, 10 కంప్యూటర్లు

వసతుల కల్పనకు నిధులు మంజూరు

మెదక్ అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పరిశోధనా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి మెదక్ జిల్లాలో 31 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ స్కూళ్లలో విద్యార్థులకు కంప్యూటర్ ఆధార బోధన, సాంకేతిక విద్యను అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

సాంకేతిక ఆధారిత బోధన

మొదటి విడతలో ఎంపికైన 20 పీఎంశ్రీ పాఠశాలలు ఒక్కోదానికి 25 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఇందులో రెండు ప్రాథమిక పాఠశాలలకు మినహా మిగితా బడులకు 10 చొప్పున డెస్క్‌టాప్ కంప్యూటర్లు, ఒక ప్రింటర్, 1కేవీ ఇన్వర్టర్‌లను మంజూరు చేసింది. రెండో విడతలో ఎంపికైన 11 పాఠశాలలకు కూడా ఇదేరీతిలో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇన్వర్టర్‌లను అందజేయనుంది. సెల్కాన్ ఇంపెక్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సామగ్రిని పాఠశాలలకు సరఫరా చేయనుంది. ప్రతీ ఎమ్మార్సీకి సరఫరా చేసిన ఎలక్ట్రికల్, నెట్ వర్కింగ్ సిస్టమ్‌తోపాటు డెస్క్ టాప్‌లు, ప్రింటర్లు, యూపీఎస్ సిస్టమ్‌లు, ఐటీసీ మెటీరియల్ వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పరికరాలు ఇన్‌స్టాలేషన్ చేసిన తర్వాత ధ్రువీకరించాలి. గతేడాది ఐటీసీ స్కూల్ ప్రాజెక్టు కింద 76 పాఠశాలలకు సమగ్రశిక్ష నిధులతో ఒక్కో పాఠశాలలకు 5 నుంచి 10 వరకు కంప్యూర్లు వచ్చాయి. ప్రత్యేక బోధకులు లేకపోవడం, శిక్షణ ఇవ్వకపోవడంతో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. ఇటీవల అమలులోకి వచ్చిన ఏఐవిద్యకు వీటిని వినియోగిస్తున్నారు.


జక్కపల్లి మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు

ప్రత్యేక నిధులు

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన 31 బడులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. ఒక్కో పాఠశాలలకు రూ. 6 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు నిధులను

మిగతా 8వ పేజీలో..



ఎమ్మెల్యే సోదరుడి కుమారుడి వివాహ విందుకు సీఎం రేవంత్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి కుమారుడి వివాహ విందుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సోమవారం పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విందుకు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదరులు, కుటుంబ సభ్యులు, కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. వధూవరులు సంతోష్‌రెడ్డి, సంగీతను రేవంత్‌రెడ్డి ఆశీర్వదించారు. వివాహ విందుకు సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ఐజీ సత్యనారాయణ, కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ పారితోష్ పంకజ్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గూడెం మహిపాల్‌రెడ్డి

భద్రాచలం రాములవారి తలంబ్రాలు ఇంటి వద్దకే..

నేటి నుంచి ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా బుకింగ్స్

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేరవేయడానికి కోసం ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) ద్వారా బుకింగ్ చేసుకున్నవారికి తలంబ్రాలను పంపిణీ చేయాలని సంస్థ నిర్ణయించింది. అయితే ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 6 వరకు లాజిస్టిక్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. తలంబ్రాల కోసం డిపోల వారీగా.. మెదక్, నర్సాపూర్ డిపోల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ -9154298642, నారాయణఖేడ్-9154298648, సంగారెడ్డి-9154298652, జహీరాబాద్-9182021588, సిద్దిపేట-9154298660, దుబ్బాక-9154298664, గజ్వేల్-9154298668, ఆర్ఎం ఆఫీసు-9154298674 నంబర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



భద్రాచలంలో జరిగే రాముల వారి కల్యాణానికి వెళ్లలేని భక్తులకు ఆర్టీసీ సువర్ణ అవకాశం కల్పిస్తున్నది. ఈ నెల 18 నుంచి టీఎస్ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకుంటే తలంబ్రాలను డోర్ డెలివరీ ఇస్తాం. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

-ప్రభులత, మెదక్ రీజినల్ మేనేజర్

నల్లవల్లిలో డంపుయార్డుతో అడవికి ముప్పు

నర్సాపూర్ నియోజకవర్గంపై తీవ్ర ప్రభావం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

డంపుయార్డు రద్దు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావన

నర్సాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి పరిధిలోని ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపు యార్డుతో నర్సాపూర్ అడవికి పెను ముప్పు వాటిల్లుతుందని, దీని ప్రభావం పూర్తిగా నర్సాపూర్ నియోజకవర్గంపై పడుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. వెంటనే డంపుయార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల మండలం నల్లవల్లి సమీపంలోని అటవీప్రాంతానికి అతీసమీపంలో 154 ఎకరాలలో డంపుయార్డు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు గ్యాప్‌లాండ్‌గా పేర్కొంటున్న ఈ భూమి కూడా అటవీప్రాంతానికే చెందుతుందని, ఈమేరకు సర్వే చేయాలని డిమాండ్ చేశారు. డంపు యార్డు వల్ల అటవీ సమతౌల్యత దెబ్బతినడంతో వణ్యప్రాణులకు ఇబ్బంది తలెత్తుతుందని చెప్పారు. నర్సాపూర్ పట్టణంలోని రాయరావు చెరువు నీరు కూడా కలుషితమై నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో పంటలు దెబ్బతింటాయని తెలియజేశారు. నర్సాపూర్, హత్నూర మండలాల్లో పలు చెరువులు నిర్వీర్యమవుతాయని, కలుషిత జలాలు మంజీరా నదిలోనూ కలుస్తాయని పేర్కొన్నారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో సమాధానమిస్తూ సానుకూలంగా స్పందించారని ఆమె తెలియజేశారు.


అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ముందస్తు అరెస్టు

అసెంబ్లీ ముట్టడి అంటూ వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్‌లు

కొండాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి సిద్ధమవుతున్నారనే అభియోగంతో సోమవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్‌లో ట్రిపుల్ ఆర్ భూబాధిత రైతులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం నిర్మాణంలో భూమి కోల్పోతున్న రైతులు అసెంబ్లీ ముట్టడికి సిద్ధం కావాలని వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్‌లు చేసుకున్నారు. ఈ విషయం ఇంటలిజెన్స్ పోలీసులకు చేరడంతో అప్రమత్తమైన పోలీసులు గ్రూప్‌లో ఉన్న రైతులను ముందస్తుగా అరెస్టు చేశారు. దీనిపై రైతులు స్పందిస్తూ తమ గ్రామానికి చెందిన రైతులు అసెంబ్లీ ముట్టడికి నిర్ణయం తీసుకోలేదని, పూర్తిగా సమాచారం తెలుసుకోకుండానే పోలీసులు అర్ధరాత్రి ఇళ్లల్లోకి వచ్చారని ఆరోపించారు. అరెస్టయిన వారిలో రైతులు రమేష్, ప్రతాప్, నాగేశ్వర్, అశోక్, రాములు, నర్సింహులు, మల్లేశం, జయరాములు, శంకర్‌యాదవ్, సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య తదితరులు ఉన్నారు. రైతుల అరెస్టుపై ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం నిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్ దామోదర్‌రెడ్డి స్పందిస్తూ రైతుల అరెస్టులను ఖండించారు.


పోలీసులు అరెస్టు చేసిన గిర్మాపూర్ ట్రిపుల్ ఆర్ నిర్వాసిత రైతులు

విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధం

● వెల్దుర్తి మండలం ధర్మారంలో ఘటన

వెల్దుర్తి, మార్చి 17 ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంలో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మర్కంటి రుక్కమ్మ, భర్త సాయిలు గుడిసెలో నివాసముంటున్నారు. సోమవారం ఉదయం ప్రమాద వశాత్తు గుడిసెలో విద్యుదాఘాతం ఏర్పడి ఇంట్లోని వంట సామగ్రి, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సూమారు రూ.25 వేల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం తరపున తమకు ఆర్థిక సాయం చేసి అందజేయాలని బాధితుడు, గ్రామస్థులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఏడుగురి ఆత్మహత్య


ఇమామ్ (ఫైల్)

చిలప్‌చెడ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాకోసం చేసిన అప్పులు అధిక మవడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన దూదేకుల ఇమామ్(46) రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. కాగా అప్పులను తీర్చడానికి 6 నెలల క్రితం భార్య ఫాతిమా, పిల్లలు సల్మాన్, సోని యాలతో కలిసి హైదరాబాద్‌లోని హాఫీజ్‌పేటకు బతుకుదెరువుకు వెళ్లాడు. 8 రోజుల క్రితం ఇమామ్ గ్రామానికి వచ్చి వెళ్లాడు. 15వ తేదీ రాత్రి కుమారుడు సల్మాన్‌తో మాట్లా డిన తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. 16వ తేదీ రాత్రి 8 గంటలకు భార్య ఫాతిమా మృతుడి సోదరుడు గౌస్‌కు ఫోన్‌చేసి చూడమని తెలిపింది. అక్కడికి వెళ్లేసరికి ఇమామ్ ఉరేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆర్థిక పరిస్థితులు.. జీవితంపై విరక్తితో ఇద్దరు


పురుషోత్తం(ఫైల్)


ఇమామ్(ఫైల్)

సంగారెడ్డి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రామాయం పేట మండలం ధర్మారం, వెంకటాపూర్ గ్రామాల్లో ఇరువురు యువకులు బలవన్మరణం చెందారు. ధర్మారం గ్రామానికి చెందిన పురుషోత్తం(34) ఆదివారం పొలానికి వెళ్లి రాత్రివరకు తిరిగి రాలేదు. దీంతో భార్య భాగ్య కుటుంబీకుల సహాయంతో పొలం వద్ద వెతకగా చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. ఆర్థిక పరిస్థితులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. అలాగే వెంకటాపూర్ గ్రామానికి చెందిన పుర్ర రాములు(36) ఈ నెల 11న ఆర్థిక సమస్య కారణంగా ఇంట్లోనే గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరగా కుటుంబీకులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున చనిపోయినట్లు ఎస్ఐ తెలిపారు.

వేధింపులు భరించలేక మహిళ..

నారాయణఖేడ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త, మామ చేసిన వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని భీంరాలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. కంగ్టి మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన పోగుల సుజాత, రవీందర్‌రెడ్డిల రెండో కూతురు మహేశ్వరికి భీంరా గ్రామానికి చెందిన బొండ్ల పండరిరెడ్డితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నిరోజులుగా భర్తతో పాటు బావమ, మామ అదనపు కట్నం తేవాలని మహేశ్వరిని వేధిస్తున్నారు. ఈ వేధింపులు భరించలేక సోమవారం ఉదయం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా సంఘటనా స్థలాన్ని ఖేడ్ డీఎస్పీ సందర్శించారు.

మద్యానికి బానిసై యువకుడు..

కంది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ వివరాల ప్రకారం.. కంది మండలం చిమ్నాపూర్‌తండాకు చెందిన బానోత్ అంబర్‌సింగ్(25) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గతేడాది పెళ్లయినా అతడు తాగుడు మానలేదు. ఆదివారం రాత్రి మద్యం సేవించి చిమ్నాపూర్ తండా పరిధిలోని ధర్మాసాగర్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు సోమవారం ఉదయం మృతదేహాన్ని చెరువులోంచి బయటకుతీశారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

సంగారెడ్డి క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని మంజీరా వద్ద సోమవారం జరిగింది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ పీ.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.... సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన బైండ్ల యాదయ్య(50) శివారులోని మంజీరా వంతెన కింద చేపలు పట్టేందుకు 16న వెళ్లాడు. కుటుంబసభ్యులు మంజీరా నదిలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం నదిలో మృతదేహం తేలింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

● యువకుడి దుర్మరణం, ఒకరికి తీవ్రగాయాలు

చేగుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌ను, లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నార్సింగి మండలం వడ్డెర కాలనీ 44వ జాతీయ రహదారి వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్ఐ అహ్మద్ మొహినుద్దీన్ వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన బోస్ ప్రభాస్(18) వడ్డెర కాలనీ నుంచి ట్రాక్టర్ పై రాయి కొట్టడానికి కూలీ పనికి బాబాయి అశోక్‌తో వెళ్తున్నాడు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న లారీ ట్రాక్టర్‌ను వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బోస్ కిందపడడంతో అతని పైనుంచి ట్రాక్టర్ బోల్తాపడి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'ఎంఎన్ఆర్'ను తనిఖీ చేసిన రాష్ట్ర వైద్య బృందం



ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫసల్‌వాది శివారులోని ఎంఎన్ ఆర్ మెడికల్ కళాశాల, హాస్పిటల్‌ను క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ స్టేట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్స ధరలు పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరుపై ఆరా తీశారు. స్కానింగ్ సెంటర్ల ఫారం ఎఫ్ తనిఖీలో భాగంగా ఆన్‌లైన్, మాన్యువల్ తేడాలను గమనించారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి అంతర్జాతీయ సహకారం

● ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



జర్మనీ వర్సిటీల అధ్యాపక బృందంతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పరిశోధన విద్యాభివృద్ధి కోసం అంతర్జాతీయ సహకారం అవసరమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి అన్నారు. జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్ నుంచి ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం విద్యా, పరిశోధన సహకారాలను చర్చించడానికి 18 మంది సభ్యుల జర్మన్ ప్రతినిధుల బృందం ఢిల్లీ, హైదరాబాద్‌లను సందర్శించింది. ఈ నేపథ్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌ను సందర్శించింది. కార్యక్రమానికి డీఏడీ (డ్యూషర్ అకాడెమిషర్ ఆస్టాష్డియెన్స్ట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ క్రైసిక్స్, జర్మన్ కాన్సులేట్ చెన్నై కాన్సుల్ జనరల్ కాథరిన్ మిసెరా-లాంగ్, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి నాయకత్వం వహించారు. ఇరువురు ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు.

సద్దిమూట శతక పుస్తకావిష్కరణ



సద్దిమూట శతకాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కమిషన్ సభ్యురాలు మరికంటి భవానీ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి తదితరులు

చేర్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఐనాపూర్ జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు ఎండీ సయ్యద్ రచించిన సద్దిమూట శతక పుస్తకాన్ని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యురాలు మరికంటి భవానీ, మాజీ జడ్పీ చైర్మన్ వేలేటి రోజారాధాకృష్ణ ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు, సమాజానికి బుద్ధిబాటలు వేయడంతో సద్దిమూట శతకం తోడ్పడుతుందని, నిజ జీవితసమస్యలను కథావస్తువుగా వినియోగించడం అభినందించదగిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ శ్రీరాముల లక్ష్మి, రంగనాయకసాగర్ రచయితల సంఘం అధ్యక్షుడు పిస్నింటి మహేంద్ర, మాజీ సర్పంచుచెరుకు రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేచర్ ఐకాన్ యూత్ సంస్థకు అవార్డు

మనోహరాబాద్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అతిపెద్ద సీఎస్ఆర్ సమ్మిట్- 2025 పురస్కారాల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళ వేదికలలో నిర్వహించిన కార్యక్రమంలో నేచర్ ఐకాన్ యూత్ సంస్థకు గ్రామీణ అభివృద్ధి పురస్కారం అవార్డు లభించింది. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన నేచర్ ఐకాన్ యూత్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రతి ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం 300 పైగా వారాల పాటు నిర్వహించారు. దీంతో నేచర్ ఐకాన్ యూత్ సంస్థను అవార్డుకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి, విశ్రాంత ఐఏఎస్ అధికారి తేజావత్ రామచంద్ర సోమవారం అవార్డును ప్రదానం చేశారు.

గౌడిగూడెం ఇసుక ఫిల్టర్లపై దాడులు

● పోలీసుల అదుపులో నిందితుడు

తూప్రాన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌడిగూడెం శివారులోని అక్రమ ఇసుక ఫిల్టర్ల నిర్వహణపై సోమవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. తూప్రాన్ ఎస్సై శివానందం ఆధ్వర్యంలో సిబ్బంది పెద్ద ఎత్తున దాడులు చేశారు. అక్రమం ఇసుక ఫిల్టర్ల వద్ద ఉన్న ఒక హిటాచీ, ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాడుల్లో అక్రమ ఇసుక ఫిల్టర్ నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, హిటాచీ, ఎక్స్‌వేటర్, ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు. కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

ముస్తాబైన నాచగిరి





రేపటి నుంచి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు

వర్గల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర హరిద్రా నది తీరాన, ఆహ్లాద కరమైన వాతవరణం, చుట్టూ పచ్చని పంట పొలాలు, సహజ సిద్ధమైన ఎత్తైన కొండ గుహలలో కొలువైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయం నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు జరగనున్నాయి. నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామివారి క్షేత్రంలో జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ తెలిపారు.

భారీ ఏర్పాట్లు

ఉత్సవాల కోసం నాచగిరి క్షేత్రంలోని తొమ్మిది ఉపలాయాల్లోనూ అన్ని ఏర్పాట్లు చేశారు. నాచగిరి క్షేత్రంలోని ఆలయాలు సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలు, ప్రాంగణమంతా రంగులతో మెరుగులు దిద్దారు. స్వామివారిని భక్తులు దర్శించుకునే విధంగా క్యూలను భారీస్థాయిలో ఏర్పాటు చేశారు. క్షేత్రంలో అక్కడక్కడ తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. తూప్రాన్, గజ్వేల్, సిద్దిపేట వెళ్లే రాజీవ్ రహదారి ప్రజ్ఞాపూర్ వద్ద వెళ్లే రహదారిపై భారీ స్థాయిలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బ్రహోత్సవాల సందర్భంగా ప్రాంతమంతా రక రకాల దుకాణ సముదాయాలు ఏర్పాటైనాయి. చిన్నారుల కోసం రంగుల రాట్నం, సర్కస్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాలలో తాత్కలిక స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బస్సులు

నాచగిరి నృసింహ్మస్వామి క్షేత్రంలో బ్రహోత్సవాల సందర్భంగా ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. మేడ్చల్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్, హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి నాచగిరి క్షేత్రం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతారు.

హుండీ ఆదాయం రూ.15.42 లక్షలు

నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించారు. నాచగిరి క్షేత్రంలో 88 రోజులకు గాను నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ. 15,42,922 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. విశ్వనాథశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుధాకర్, పాండు, నరేందర్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన భ్రమరాంబిక సేవా సమితి, శివకేశవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



నేటి నుంచి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని శ్రీ మహారేణుక ఎల్లమ్మదేవి ఆలయ 49 వార్షికోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక్కడ కొలువైన అమ్మవారు పూర్తిగా శాఖహర నైవేద్యాలనే సమర్పిస్తారు. అందుకే అమ్మవారిని బ్రహ్మణింటి ఎల్లమ్మగా పిలుస్తారు. ఏటా వార్షికోత్సవాలు, ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఆలయంలో సిద్దోహం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు 49వ వార్షికోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. మొదటి రోజు మంగళవారం అమ్మవారికి అభిషేకంతో పాటు విశేష పూజ కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం పట్టణ పురవీదుల్లో అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగుతుంది. రెండవ రోజు బుధవారం ప్రత్యేక పూజలతో పాటుగా అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. చివరి రోజు గురువారం అమ్మవారి జప తప పూజాధికాలతో పాటుగా మహా చండీ హవనం నిర్వహిస్తారు. భక్తులకు యజ్ఞ ప్రసాద వితరణ చేపడతారు. ఈ మూడు రోజుల పాటు భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుంది. పట్టణ ప్రజలే కాకుండా ఇతర చోట్ల నుంచి కూడా భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆలయ వార్షికోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు లాల్ బహద్దూర్ తెలిపారు.



బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో..

గుమ్మడిదల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రెండు వందల యేళ్ల చరిత్ర ఉన్న బొంతపల్లి శ్రీ భద్రకాళి సహిత వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మద్ద ప్రతాప్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి శశిధర్ గుప్తా తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రజలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. దీంతో ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు వేయడంతో పాటు, వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



ఎండిన పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు

సింగూరు నీటిని విడుదల చేయాలి లేదంటే.. గేట్లు బద్దలు కొడుతాం

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పుల్‌కల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ వరి పొలాలకు వారం రోజుల్లో సింగూరు జలాలను విడుదల చేయకపోతే మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో రైతులను వెంటబెట్టుకుని సింగూరు ప్రాజెక్టును ముట్టడించి, గేట్లు బద్దలు కొడుతామని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హెచ్చరించారు. మండలంలోని ఉమ్లానాయక్, హన్మానాయక్ గిరిజన తండాలలో సాగవుతున్న వరి, జొన్న పంటలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల జైపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సింగూరు ఎడమ కాలువ ఆధునీకీకరణ పేరుతో నీటి పారుదల శాఖ అధికారులు ఖరీఫ్, యాసంగి సీజన్లను క్రాప్ హాలీడేగా ప్రకటించి రైతుల నోట్లో మట్టికొట్టారని ఆరోపించారు. గ్రామాలలో ఎలాంటి చాటింపు, దండోరా వేయకుండా ఇష్టానుసారంగా క్రాప్ హాలీడే ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, నాయకులు ఎర్రోల్ల పోచయ్య, తుంగె అనంతి, దేవీసింగ్ తదితరులున్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

రెండు రోజులుగా ధర్నా

కాంగ్రెస్ నేత హామీతో విరమణ



ఆందోళనకు దిగిన రైతులతో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పంట పొలాలకు సాగునీటిని అందించాలని పలువురు రైతులు గజ్వేల్-చేగుంట జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చందాయిపేట, కసంపల్లి, నర్సంపల్లి, మాచిన్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు ఇందుప్రియల్ కెనాల్ వద్ద, సోమవారం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. తాము ఎర్రటిఎండలో రెండు రోజులుగా ధర్నా చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంట పొలాలకు సాగునీటిని అందించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇరిగేషన్ డీఈతో కలిసి వచ్చి రైతులతో మాట్లాడారు. మాచిన్‌పల్లి, ఇందుప్రియ ల్ వద్ద అడవిలో నుంచి కాలువ నిర్మాణం పూర్తి చేసి ఆయా గ్రామాలకు సాగునీటికి సమస్య లేకుండా శాశ్వ త పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఈ విష యాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి యాసంగి సీజన్‌లో సాగునీటిని అందించేందుకు ప్రయ త్నిస్తానని చెప్పారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కాంగ్రెస్ నాయకులు మద్దెల స్వామి, నవీన్, శ్రీకాంత్, ప్రణయ్, వెంగళరావు, తదితరులు ఉన్నారు.

మా పంటలెండిపోతున్నాయ్..

మద్దూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి లద్నూరు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ సోమవారం రిజర్వాయర్ వద్ద లద్నూరు గ్రామ రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్‌ను నమ్ముకుని పంటలు సాగు చేశామని, ఎండల కారణం గా భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మకూరు రిజర్వాయర్‌లోకి నీటిని నింపుతున్న క్రమంలో లద్నూరు రిజర్వాయర్‌ను నింపి కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంటల్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లద్నూర్ రిజర్వాయరే తమకు దిక్కు అని ఈ సందర్భంగా రైతులు పేర్కొన్నారు. పంటల సాగుకు వేలల్లో పెట్టుబడులు పెట్టామని, కళ్లముందే పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మకూరు రిజర్వాయర్ నిండగానే లద్నూరు రిజర్వాయర్‌లోకి నీటిని అందిస్తామని ఇరిగేషన్ ఏఈ వెంకన్న, డీఈ శ్రవణ్‌కుమార్ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ కనకరాజు, రైతులు నంద శ్రీను, ఆదాం, రాజు పలువురు పాల్గొన్నారు.

రేపు 'దేవాదుల' నీటి విడుదల : ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గ రైతులకు సాగునీటిని అందించేందుకు దేవాదుల మూడో దశ నీటి విడుదలను రేపు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని సక్రమంగా అందించకపోవడంతో రూ.600 కోట్ల మేర పంట నష్టం వాటిల్లిందని, వెంటనే పంపులు ఆన్‌చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో మూడవ దశను ప్రారంభిస్తున్నట్లు ఆయన సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదుల పరిధిలోని తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూరు రిజర్వాయర్లను నింపి నియోజకవర్గంలోని ఆయకట్టుకు సాగునీరందించాల్సిన ప్రభుత్వం పట్టించకోలేదన్నారు. నాట్లు అయిపోయి నీళ్లకోసం అన్నదాతలు తండ్లాడుతుంటే అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడంతో పంటలు ఎండిపోయాయన్నారు. 34 రోజులపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది ధర్నా చేసినా పట్టించుకోలేదని, 60రోజుల్లో 40 రోజులే పంపులు నడపడం శోచనీయమన్నారు. జనగామ నియోజకవర్గంలో 50శాతంపైగా పంటలు ఎండిపోయాయని, బాధిత రైతులు గోడువెళ్లబోసుకున్న విషయాన్ని కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారులతోపాటు మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో దేవన్నపేట నుంచి ధర్మసాగర్‌కు వచ్చే థర్డ్ ఫేస్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో మోటార్లను ఆన్‌చేసి రిజర్వాయర్లు, చెరువులను నింపి పంటలను కాపాడాలని, నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతానన్నారు.




ఆత్మహత్య చేసుకున్న తల్లిదండ్రుల అంత్యక్రియలు నిర్వహిస్తున్న చిన్నారులు

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

తొగుట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్న భార్యాభర్తల అంత్యక్రియలు ఎల్లారెడ్డిపేటలో సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకోవడంతో వారి నలుగురు పిల్లలు రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. తల్లిదండ్రులు లేక ఆ చిన్నారులు దిక్కులేని పక్షుల్లా మారారు. వారి రోదిస్తుంటే.. వారించడం ఎవరి వల్ల కాలేదు. అంతిమ సంస్కారాలకు సైతం డబ్బులు లేకపోవడంతో దాతలు ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి తండ్రులకు వేర్వేరుగా ఇద్దరు తనయులు అంతిమ సంస్కారాలు చేపట్టడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. అంత్యక్రియలకు నాయకులు, గ్రామస్థులు భారీగా తరలివచ్చారు. చిన్నారుల భవిష్యత్ పై చర్చించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తొగుట కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి, మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్యలు పాడె మోశారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య



సాయి(ఫైల్)

బెజ్జంకి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బెజ్జంకి మండలం నరసింహులపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నరసింహులపల్లి గ్రామానికి చెందిన కుసుంబ సాయి (22) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. సాయి సుమారు ఐదు సంవత్సరాల నుంచి దగ్గు, దమ్ము, కడుపునొప్పితో బాధపడుతుండటంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చూపించారు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలు ఎక్కువడంతో వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన అక్కడి వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు సాయిని బెజ్జంకి ఆస్పత్రికి, అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సాయి మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.



పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన అమీన్‌పూర్ కూరగాయల మార్కెట్

అమీన్‌పూర్

● అభివృద్ధి పనులకు నిధుల గ్రహణం ● పిల్లర్ల స్థాయిలో కూరగాయల మార్కెట్

● కలగానే ఇండోర్ స్టేడియం ● రాక్ గార్డెన్‌కు నిధుల కొరత

అమీన్‌పూర్, 17 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ జనాభా సుమారు 60 వేలు. పేరులో ఉన్నట్లుగానే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పేద స్థితిలో ఉంది. లక్షల్లో పన్నులు వసూలవుతున్నా.. నిధులు లేక ఏళ్లుగా పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. పేరుకు అతిపెద్ద మున్సిపాలిటీ అయినా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వందలాది కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లతో నిండి ఉన్న మున్సిపాలిటీలో కనీసం కూరగాయల మార్కెట్ లేకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం.

మూడేళ్ల క్రితం పునాదులు

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో మూడేళ్ల క్రితం 6.40కోట్ల అంచనాతో మూడెకరాల విస్తీర్ణంలో కూరగాయలు, మాంసం మార్కెట్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పిల్లర్లు, ప్లింత్ భీంల వరకు పనులను పూర్తి చేశారు. రాష్ట్ర పబ్లిక్ హెల్త్ శాఖ నుంచి నిధులు మంజూరు చేయాల్సి ఉండగా, మూడేళ్లుగా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పాత అమీన్‌పూర్ మున్సిపల్ పాలకవర్గం సైతం అనేక మార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందన కరువైంది. ప్రారంభించిన పనుల్లో పిల్లర్లకు వేసిన స్టీల్ వర్షానికి, ఎండకు తడిసి తుప్పు పట్టిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నియోజకవర్గంలోని తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలలో సైతం మార్కెట్‌యార్డ్‌ల పరిస్థితి ఇలాగే ఉంది.

మినీ స్టేడియం, రాక్‌గార్డెన్ పనుల ఊసే లేదు...

ఏడాదికి సుమారు రూ. 60 కోట్ల ఆదాయం ఉన్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో రూ. పది కోట్ల వ్యయం అయ్యే పనులు సైతం ఏళ్ల తరబడి నిలిచిపోయాయి. మూడేళ్ల క్రితం మున్సిపల్ పాలకమండలి ఐదు ఎకరాల విస్తీర్ణయంలో మినీస్టేడియం కోసం చేసిన శంఖుస్థాపన శిలాఫలకానికే పరిమితం అయింది. సుమారు కోటి రూపాయల సీఎస్ఆర్ నిధులతో గుట్టలు, రాళ్ల చదును చేసేందుకు వెచ్చించారు. మున్సిపల్ ఫండ్ నుంచి కేటాయించాల్సిన నిధులకు ఉన్నతాధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంలేదు. మినీ స్టేడియం పనులకు నిధులు లేకపోవడంతో కనీసం షటిల్ స్టేడియం ఏర్పాటు కోసం రూ. 50 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఇందుకు అనుమతులు రాలేదు. మినీ స్టేడియం పక్కనే మూడెకరాల విస్తీర్ణంలో రెండున్నర కోట్ల అంచనాతో నిర్మించ తలపెట్టిన రాక్‌గార్డెన్‌కు సైతం నిధుల గ్రహణం పట్టుకుంది. రాక్‌గార్డెన్ నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన నిధుల్లో ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని అమీన్‌పూర్ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

నిధుల మంజూరులో జాప్యం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయిన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మార్కెట్ యార్డ్, రాక్‌గార్డెన్, మినీస్టేడియం పనులు ప్రారంభించేందుకు కావాల్సిన నిధులు మంజూరు జరిగేలా చూస్తున్నాం. ప్రాధాన్యత క్రమంలో నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నాం.

- జ్యోతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించండి

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే సమస్యలను ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఇందులో భూమి మార్పిడి చేయాలని, ధరణిలో భూమి మిస్సింగ్ చూపిస్తున్నదని, తన భర్త వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తూ మృతిచెందాడని, అతడి ఉద్యోగం ఇవ్వాలని, వీల్‌చైర్ మంజూరు చేయాలని, పెన్షన్ మంజూరు చేయాలని, భూ సమస్యలను పరిష్కరించాలని తదితర సమస్యలపై మొత్తం 54 అర్జీలు అందాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజావాణికి వచ్చే ప్రజలకు కలెక్టరేట్ ప్రాంగణంలో మంచినీటిని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులో గల ప్రభుత్వ కుంటలను ఆక్రమిస్తున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) నిధులు కేటాయించినందుకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.



ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రజావాణికి 56 దరఖాస్తులు

మెదక్ అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 56 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

● మాజీ;మంత్రి డా.చంద్రశేఖర్

సంగారెడ్డి/సంగారెడ్డి. మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : దళితుడైన శాసనసభాపతిని అగౌరవపరుస్తూ శాసనసభలో వ్యవహరించిన తీరుపై సరికాదని, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రహదారిపై ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బస్టాండ్ వద్ద ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ఐఎన్‌టీయూసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, నియోజకవర్గం జిల్లా అధ్యక్షురాలు అస్మాతబస్సుం, నాయకులు పాల్గొన్నారు. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని తొలగించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దళిత సంఘాల ఆధ్వర్యంలో మాజీ మంత్రిని శాసనసభ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పట్టణంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్‌తో సమానం : డీఈవో



సంగారెడ్డిలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్‌తో సమానమని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ తరగతుల నిర్వహణను సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఆగిపోయిన చదువుకు ఓపెన్ విద్య దోహదపడుతుందన్నారు. వచ్చేనెల 20 నుంచి జరిగే ఓపెన్ స్కూల్ పరీక్షలకు అభ్యాసకులు సంసిద్ధులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, ఏడీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ లింబాజి, ఏసీ పండరినాయక్, డీఎస్‌వో సిద్దారెడ్డి, వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికతోనే అభివృద్ధి: మల్లేశ్‌గౌడ్

మెదక్ అరన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం, ఒకే ఎన్నికతోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌పై వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడంతోపాటు దేశమంతా ఒకే విధానం అమలుకు ఈ ప్రక్రియ తోడ్పడుతుందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక అనే అంశాన్ని కార్యకర్తలంతా క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే 2029 ఎన్నికలను ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, జిల్లా కో కన్వీనర్లు రంజిత్‌రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వాల్దాస్ మల్లేశంగౌడ్

ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 656 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 19,938 మందికి 19,282 మంది హాజరుకాగా, 656 మంది గైర్హాజరయ్యారు. 96.71 హాజరుశాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. కాగా సంగారెడ్డిలోని షాహీన్, సెయింట్ ఆంథోనీస్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో గడ్డివాము దగ్ధం

● పశువులకు తప్పిన ప్రమాదం



మంటల్లో కాలిపోతున్న గడ్డివాము

శివ్వంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో గడ్డివాముకు నిప్పు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. మండల పరిధిలోని ఏదులాపూర్ గ్రామానికి చెందిన బూరెడ్డి అంజిరెడ్డి గ్రామ శివారులోని తన పొలం దగ్గర 50 మోపుల గడ్డివాము పేర్చి ఉంచాడు. కాగా అనుమానాస్పద స్థితిలో గడ్డికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. పక్కన చెట్లకు కట్టేసిన పశువులు వేడికి తట్టుకోలేక తెంపుకుని పోవడంతో ప్రమాదం తప్పింది. గడ్డివాము దగ్ధం కావడంతో పశువులకు మేత లేకుండాపోయిందని బాధితుడు కంటతడి పెట్టాడు. అయితే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌చేస్తే కాలుతున్న మంటల ఫొటోలు పంపిస్తేనే వస్తామని చెప్పారు. మంటలు పక్క పొలంలోకి వెళ్లకుండా గ్రామంలోని నీటి ట్యాంకర్లతో ఆర్పేశామని పలువురు రైతులు తెలిపారు.

ఇసుక ఫిల్లర్ల కూల్చివేత

తూప్రాన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక ఫిల్టర్‌పై రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. అక్రమంగా నిర్మించిన ఇసుక ఫిల్టర్‌ను కూల్చివేశారు. ఈనెల 12న 'హల్దీ' జల్లెడ అంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆర్డీవో జయచంద్రారెడ్డి స్పందించారు. తూప్రాన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కిష్టాపూర్ హల్దీవాగు పొడవున ఏర్పాటు చేసిన అక్రమ ఇసుక ఫిల్టర్లను ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చేశారు.

రికార్డులు సరిగా లేకపోవడంతోనే విచారణ

నర్సాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ అటవీశాఖ పరిధిలో ఉపాధిహామీలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించి రూ.9 లక్షల పనులకు సంబంధించి రికార్డులు ప్రజావేదికలో సరిగ్గా చూపకపోవడంతో విచారణకు ఆదేశించినట్లు ఎంపీడీవో మాధవీలత పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నిర్వహించిన ప్రజావేదికలో ఉపాధిహామీలో చేసిన తొమ్మిది లక్షల మేర పనులకు రికార్డులు చూపకపోవడంతో డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు సూచన మేరకు విజిలెన్స్ విచారణకు నివేదించినట్లు చెప్పారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

● సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు

తూప్రాన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టీజీపీసీ రాష్ట్ర జేఏసీ అసెంబ్లీ ముట్టడికి ఎలాంటి పిలుపు లేనప్పటికీ మెదక్ జిల్లాలో ఆర్టిజన్లను ముందస్తు అరెస్టు చేయడం సరైనదికాదని యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యూఈఈయూ) (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్‌లో సోమవారం జిల్లా అధ్యక్షుడు మన్నె నర్సింలుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందే ఆర్టిజన్లను కన్వర్షన్ ఇస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చడం సరైన పద్ధతికాదన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



శ్రీనివాస్

పటాన్‌చెరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని గణిత విభాగం పరిశోధక విద్యార్థి ఎస్.శ్రీనివాస్ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'బీజ గణిత విధానంలో వైబ్రేషనల్ హామిల్టోనియన్ ఉపయోగించి పాలిటామిక్ అణువుల వైబ్రేషనల్ ఫ్రీక్వెన్సీలను అధ్యయనం' చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించడంతో డాక్టరేట్ వచ్చిందని పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ స్కూల్, గణితశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.విజయశేఖర్ సోమవారం తెలిపారు. శ్రీనివాస్‌ను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్, గణితశాస్త్ర విభాగాపతి డాక్టర్ ఎం.రెజా, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మా భూములు తిరిగి ఇచ్చేయండి

కంది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఎండీఏ పేరిట మూడేళ్ల క్రితం తీసుకున్న భూములను తిరిగి ఇచ్చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత రైతుల ఆందోళన చేపట్టారు. కంది గ్రామంలో 656 సర్వే నెంబరులోని నిరుపేద దళిత రైతుల భూములను హెచ్ఎండీఏ వెంచర్ చేయడానికి మూడేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు తీసుకున్నారు. బదులుగా ఎకరానికి 600 గజాల ఇంటి స్థలం ఇస్తామని తాత్కాలిక సర్టిఫికెట్లను సైతం ఇచ్చారు. తక్షణమే ఆ భూములను రైతుల పేరిట లేకుండా ఆన్‌లైన్‌లో తొలగించారు. ఏళ్లు గడుస్తున్నా ఇంటి స్థలాల పొజిషన్ ఇవ్వలేదు. అంబేడ్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ రైతులను భయపెట్టి భూములు తీసుకోవడమే కాకుండా.. ఇంటి స్థలాలకు పొజిషన్ చూపకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జిల్లా కార్యదర్శి జెల్లా సురేష్, రైతులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కొండాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలను నడిపిన వ్యక్తులకు సంగారెడ్డి జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ ఒకరికి రెండు, మరొకరికి మూడురోజుల జైలు శిక్ష విధించింది. కొండాపూర్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మల్కాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కంది మండలం ఉత్తర్‌పల్లికి చెందిన పార్వతి విష్ణు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా కందుకూరు చెందిన ఏందుకొండలు మద్యం తాగి పట్టుబడ్డారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపర్చగా విష్ణుకు రెండు, ఏడకొండలుకు మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించాలి

పుల్‌కల్/నాగల్‌గిద్ద/కోహీర్/జోగిపేట రూరల్/శివ్వంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. చౌటకూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో సేవలందిస్తున్న ఆశాలు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అందోలు డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీఐటీయూ ఏరియా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఆశాలు వైద్యాధికారి జువేరియాబేగంకు, కోహీర్ మండలంలోని పలు గ్రామాల ఆశాలు తహసీల్దార్ బాలశంకర్‌కు, జోగిపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విష్ణుసాగర్‌కు, శివ్వంపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు.



పుల్‌కల్: తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

అంగన్‌వాడీల వేతనాలు పెంచకుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తాం

సంగారెడ్డి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచకుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం 48 గంటల పాటు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రభుత్వ పథకాలు అమలుచేయడంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

19న రామాలయ భూముల కౌలు వేలం

నారాయణఖేడ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని చరిత్రాత్మక ఆలయమైన రాంమందిర్‌కు చెందిన భూముల కౌలుకు సంబంధించి వేలం వేయనున్నట్లు ఈవో శివరుద్రప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబరు 87లో 27 ఎకరాల 16 గుంటలు, సర్వే నెంబరు 106లో 5 ఎకరాల 23 గుంటలు, సర్వే నెంబరు 23లో 7 ఎకరాల 21 గుంటలు, సర్వే నెంబరు 90లో ఎకరం 9 గుంటలు ఉన్నది. ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2027 వరకు కౌలు పొందడానికి వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాల కోసం 8096834957 నంబర్లలో సంప్రదించాలన్నారు.

19న తైబజారు వేలం

తూప్రాన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ మున్సిపల్ తైబజారు వేలం పాటలు ఈనెల 19న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తైబజారు, పశువుల సంతలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం: ప్రిన్సిపాల్

సంగారెడ్డి అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. సంగారెడ్డిలోని తారా కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఎన్‌సీసీ, వృక్షశాస్త్ర విభాగాల సంయుక్తంగా బిస్లరీ కంపెనీ ప్రైవేట్ ఇండియా వారి సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని శ్రమదానం ద్వారా తొలగించారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గౌతంకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. హాల్‌టికెట్లు ఏప్రిల్ 15న డౌన్‌లోడ్ చేసుకోవాలని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ హయాంలోనే పల్లెల్లో ప్రగతి

పుల్‌కల్/వట్‌పల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెల్లో ప్రగతి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ చౌటకూర్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ అన్నారు. మండలంలోని చక్రియాల్ గ్రామంలో సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.10 లక్షల సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే మండల కేంద్రమైన వట్‌పల్లిలో రూ.15 లక్షలతో మంజూరైన సీసీరోడ్డు పనులను వెంకట ఖ్వాజ ఆశ్రమ పీఠాధిపతి ముకుందరావు చిస్తీ చేతులమీదుగా పూజలు చేసి ప్రారంభించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్‌జోషి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి 'పొలంబాట'

జిన్నారం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారం కోసం అధికారులు పొలంబాట పట్టారు. సోమవారం విద్యుత్‌శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు మండలంలోని కిష్టాయ్యపల్లి, కొర్లకుంట గ్రామాల పరిధిలో పర్యటించారు.

అక్రమ కట్టడం కూల్చివేత

జిన్నారం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లి ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సోమవారం కాజీపల్లి 181 సర్వే నెంబరులో నిర్మించిన అక్రమ కట్టడాన్ని ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, సిబ్బందితో కలిసి కూల్చివేయించారు.

ఎయిడ్స్‌రహిత సమాజ నిర్మాణానికి కృషి

నారాయణఖేడ్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి అన్నారు. ఖేడ్ శివారులోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు నెహ్రూ యువకేంద్రం, ఎయిడ్స్ నియంత్రణ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.

'రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలి'

నారాయణఖేడ్: ప్రభుత్వం రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయాలని పోలీస్ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోర్గి సంజీవ్ అన్నారు. ఖేడ్ తహసీల్ మైదానంలో ఎస్సీల వర్గీకరణ చట్టం చేశాకే ఉద్యోగ నియామకాల పరీక్షల ఫలితాలను వెల్లడించాలని, ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారానికి ఏడోరోజుకు చేరింది.

పీఎంశ్రీకి 31 పాఠశాలలు

5వ పేజీ తరువాయి

అందజేస్తోంది. ఇప్పటికే ఫీల్డ్‌ట్రిప్, ఎక్స్‌పోజర్ విజిట్, సైన్స్, మ్యాథ్స్ యాక్టీవిటీ, స్కూల్ యాన్యువల్‌డే, ట్వినింగ్ మోటివేషనల్ లెక్చర్స్ నిర్వహణకు సంబంధించి నిధులు విడుదలయ్యాయి. పాఠశాలల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులు విహార యాత్రలు వెళ్లడానికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు సాంకేతిక విద్య వైపు అడుగులు పడుతుండడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీరప్పస్వామిని దర్శించుకున్న క్రాంతికిరణ్

పుల్‌కల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు గ్రామంలో వెలసిన బీరప్పస్వామిని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నియోజకవర్గ అగ్రనేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డితో కలిసి దర్శించుకోగా, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి వేరుగా వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతోపాటు బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.నరసింహారెడ్డి, పోచారం రాములు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాయకులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కిష్టారెడ్డి, నరసింహారెడ్డి, బుర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్నస్వామి ఆలయ ఉత్సవాలు

కల్హేర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామంలో మల్లన్నస్వామి ఆలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన మల్లన్నస్వామి, మేడాలమ్మ, కేతమ్మ కల్యాణంలో ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవితాగోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మాణిక్‌ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలు

పెద్దశంకరంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండలం ఆరేపల్లిలో గంగమ్మతల్లి, శివలింగం, నంది ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదబ్రాహ్మనుల మంత్రోశ్చరణల మధ్య అమ్మవారికి, శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన బాలయోగి, కృష్ణమహరాజ్ అందించారు.

రత్నానాయక్‌తండాలో తాగునీటి అవస్థలు

నాగల్‌గిద్ద, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన నాగల్‌గిద్దతో పాటు ముక్తాపూర్, రత్నానాయక్‌తండా తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొన్నది. రెండురోజులుగా మిషన్ భగీరథ సరఫరా నిలిచిపోవడంతో తండావాసులు సోమవారం ఓ బోర్ నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తైబజార్ ఆదాయం రూ.70 లక్షలు

నారాయణఖేడ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను తైబజార్ వేలం పాట ద్వారా రూ.70 లక్షల 20 వేల ఆదాయం వచ్చిందని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తైబజార్, మేకలబజార్, పెద్దమాంసం, ఎడ్లబజార్, చిన్నమాంసానికి సంబంధించి వేలం పాట నిర్వహించారు. తైబజార్‌ను రూ.42.05 లక్షలకు గులెన్‌గారి రాములు, మేకల బజార్‌ను రూ.21.85 లక్షలకు గడీల నర్సింలు, ఎడ్ల బజార్‌ను రూ.3.65 లక్షలకు, పెద్ద మాంసం 1.90 లక్షలకు, చిన్నమాంసం రూ.75 వేలకు యాదుల్ ఖురేషి దక్కించుకున్నాడన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు

కోహీర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడం లేదని సోమవారం 'నీడ లేదు.. నీరు కరువు' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో నీడ, నీరును ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో పనులు చేస్తున్న పని ప్రదేశానికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు.

స్కావెంజర్లకు జీతాలు అందజేత

కౌడిపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : స్కావెంజర్లకు వచ్చేజీతం రూ.12 వేలు.. ఇచ్చేది రూ.6 వేలు అన్న కథనం 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైంది. ఈ మేరకు ఎంఈవో బాలరాజు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్పందించారు. జీతాల పంపిణీ విషయంపై ఆరాతీసి.. స్కావెంజర్లకు వచ్చిన జీతం కంటే తక్కువ ఇవ్వడమేంటని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జనవరి, ఫిబ్రవరికి సంబంధించి జీతాలు అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి యత్నం

నర్సాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం ఎల్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ఆదివారం రాత్రి యత్నించారు. దీంతో గ్రామంలో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పోలీసులు ఘటనా చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మాధవీలత, ఎంపీవో శ్రీనివాస్‌తో పాటు పలువురు వెళ్లి ఘటనపై ఆరాతీశారు. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురిని గుర్తించి, ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

ప్రైవేటుకు దీటుగా విద్యనందిస్తున్నాం

నర్సాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా విద్యనందిస్తున్నాం.. కాలేజీలో చేరండి' అని నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దామోదర్ అన్నారు. సోమవారం ఆయన నేతృత్వంలో కాలేజీలో ఉన్న సదుపాయాలు, ఫ్యాకల్టీ, ల్యాబ్ తదితర విషయాలతో పాటు ఇతర ప్రత్యేకతలను వివరిస్తూ కరపత్రాలు ఆవిష్కరించారు.

కారు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

పెద్దశంకరంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఉత్తులూరు గ్రామ శివారులో చోటు చేసుకున్నది. పల్లెగడ్డ గ్రామానికి చెందిన మహేష్ ఉత్తులూరు గ్రామానికి చెందిన బంధువుల వద్దకు వచ్చాడు. ఆదివారం రాత్రి మహేష్, ఉత్తులూరుకు చెందిన రాజు కలిసి పెద్ద శంకరంపేట వైపు వస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తలూరు బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మహేష్, రాజుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారమందించడంతో వారు జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

మంజీరాలో యువకుడు గల్లంతు

సంగారెడ్డి క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కల్పగూరు శివారులోని మంజీరా దిగువన స్నానానికి వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. అందోల్‌కు చెందిన నరేష్(30) ఆదివారం సాయంత్రం స్నానం చేయడానికి మంజీరాలోకి దిగగా గల్లంతయ్యాడు. సోమవారం పోలీసులు గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. నరేష్ భార్య దుర్గ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

వాటర్ ట్యాంక్ తొలగింపు

చేగుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) చేగుంట మండలం వడియారం ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం తొలగించారు. 45 ఏళ్ల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచన మేరకు పంచాయతీ కార్యదర్శి విజయపాల్‌రెడ్డి తొలగించారు. ట్యాంక్‌ను తొలగిస్తున్న సమయంలో ప్రాథమిక పాఠశాల ప్రహరీకి కొంత నష్టం జరిగింది. దూరంగా ఉన్న ఆటో, కారు అద్దాలు పగిలిపోయాయి.